# శాసనం

— కోకా సాయి

పులిహోరలో పులివుందని భయపడే పిరికివాళ్ళూ! నేతి బీరలో నేతిని వెతికే ఆశాజీవులూ వున్నారన్నా నమ్మవచ్చుకాని, రాష్ట్రం ప్రశాంతంగా వుంది అనే వార్తలు వాస్తవాలు కావు. ఎందుకంటే గత రెండు నెలలుగా ప్రజాజీవనం అస్తవ్యస్థం, అల్లకల్లోలం, బస్సుల దగ్ధం, రైళ్ళరద్దు, కాల్పులు, కర్ఫ్యూలు.

నా సుపుత్రుడు వచ్చే మంగళవారం రాజధానిలో అతి ముఖ్యమైన అంతిమ ఇంటర్వ్యూకు హాజరుకావాలి. ఎందుకంటే ఈనెలతో వయోపరిమితి ముగుస్తుంది. ఆ తరువాత సర్కారు గిరి చేసే ఆశకు నీళ్ళొదులుకోవాల్సిందే. పైవాడి దయవల్ల అల్లకల్లోలాలు సద్దుమణిగి, వాడి ఇంటర్వ్యూ సవ్యంగా జరిగి సెలక్టు కావాలి. అక్షరాస్యత పెరిగి పోటీ అనివార్యమని సర్దిపెట్టుకుందామంటే, దొడ్డిదారి ర్యాంకులు, ప్రక్కదారి ఉద్యోగ నియామకాలు పొందే దుస్థితి బురకాలో సాగుతూనే వుంది. ఏమి చెయ్యాలా అని దీర్ఘంగా ఆలోచిస్తున్నాను.

''ఏవండీ! ఇక ఆలోచనలు కట్టిపెట్టి నిద్రపోండి! అర్ధరాత్రి దాటింది! ఆరోగ్యం పాడవుతుంది.'' అర్ధాంగి కదా! అర్ధరాత్రి నిద్రలోంచే ఉచిత సలహా పారేసింది ఆప్యాయంగా.

నా సింహాసనం పడకకుర్చీలోంచి లేచాను. కిటికీ దగ్గరకు నడిచాను. వీధిలో కుక్కలు అరుస్తున్నాయి. కుక్కలతో పాటు రాంబాబు కూడా అరుస్తున్నాడు. రాంబాబు ఒకవీధి రౌడీ. వాణ్ని ఎవరూ పట్టించుకోరు, పట్టుకోలేరు. వాడి నోటికి భయపడి వీధి జనం వాణ్ని ఎదిరించరు సరికదా కనీసం వాడికి ఎదురెళ్ళటాన్కి మనస్కరించరు. వాడంటే హడల్. ఆ శబ్ద కాలుష్యాన్ని అరికట్టడానికి కిటికీ తలుపులు మూయబోయి నిర్ఘాంతపోయాను. త్రాగిన మత్తులోపడి లేస్తున్న రాంబాబును మోయలేక మోస్తూ, వాడి భుజాలు గట్టిగా పట్టుకు లాక్కొస్తున్నాడు మా అబ్బాయి. రాంబాబు మావాణ్ని విదిలించుకుంటున్నాడు. అరుస్తున్నాడు... మావాడు బలంగా పట్టుకు ముందుకు నడిపిస్తున్నాడు. నాలో ఉద్వేగం... ఉద్రేకం! ఆరంభమయింది. కోపంతో పెదాలు ఒకదానిపై ఒకటి పడి పంటి మధ్య నలుగుతున్నాయి. ఒక కుంటివాడికో, గ్రుడ్డివాడికో సాయం చేస్తే మానవతావాదిగానో, మంచివాడిగానో గుర్తింపు పొందేవాడు. పిడికెడు పుణ్యమైనా దక్కుతుంది. ఇలాంటి నిష్ప్రయోజకుడికి, త్రాగుబోతు, తిరుగుబోతు, గూండాకి సాయం చేస్తే చూసేవాళ్ళు మావాణ్ని వాడిలాంటి వాడి క్రింద జమకడ్తారు. ''వీడికి బుద్ధిలేదు... రాదు...'' మావాణ్ని కసిగా తిట్టుకున్నాను.

• • •

హైదరాబాద్‌లో ఉన్నతస్థాయిలో, స్థానాల్లో వున్న నా శిష్యత్రయాన్ని కలిసి, మావాడి ఉద్యోగానికి రికమండేషన్ అర్ధించి అభ్యర్థించి ఆరోజే ఇంటికి తిరిగి వచ్చాను. వచ్చిన క్షణం నుంచి మౌనంగా నా మానాన నేను మౌనవ్రతంలో ఉండిపోయాను. నా భార్య, కొడుకు సతమతమౌతున్నారు విషయం కదలేద్దామని. నా వాలకం వాళ్ళను కాస్తంత ఇబ్బంది పెడుతుంది. ''ఏవండీ! ఏవిటలా వున్నారు?'' ఎట్టకేలకు భయంగానే అడిగింది నా అర్ధాంగి. నేను సమాధానం చెప్పకుండా సూట్‌కేసులోంచి పట్టుపంచె, కండువా- భగవద్గీత తీసి, టేబిల్ మీద అప్పటికే పెట్టిన వెండి సింహాత్లాట చేతికర్ర ప్రక్కగా పెట్టాను. నన్నూ, నేను టేబిల్పై వుంచిన ఆ మూడు వస్తువుల్ని వింతగా చూస్తున్నారు నా భార్యా, కొడుకూ.

నేను చెప్పడం ప్రారంభించాను. ''ఎవర్నీ! ఎప్పుడూ! ఏదీ! యాచించడం ఎరగని, చేతకాని ఈ వెర్రివెంగళప్ప నిజంగా బ్రతకలేక బడిపంతులు గిరి వెలగపెట్టాననిపిస్తూంది. నా దగ్గర... అ..ఆ...లు దిద్దిన నా ప్రియ శిష్యులు, ఈ మాష్టారి మాట వేదవాక్కని, నే అడగాలేకాని ప్రాణాలు సయితం అర్పిస్తామని ప్రగల్భాలు పలికిన నా శిష్యత్రయం- ఒక పోలీసు ఉన్నతాధికారిగా 'వర్మ', ఒక ఐ.ఎ.ఎస్. అధికారిగా 'గిరి' మాటల్లో మకరందాన్ని ఒలకపోశారు. ఈ పట్టుపంచె, పట్టుకండువా ఒకడూ! ఈ భగవద్గీత మరొకడూ ఇచ్చి ఆప్యాయత పన్నీరు చిలకరించారు. చివరగా మూడోవాడు 'వాసు' అధికార పార్టీలో ఉన్నత పదవిలో ఉండి కూడా, క్షమించమని భక్తితో ఈ వెండి నగిషీ సింహాత్లాట చేతికర్ర ఇచ్చి నన్ను సున్నితంగా వదిలించుకున్నాడు. దేహీ అని వెళ్ళిన నన్ను ఉద్యోగ నియామక విషయంలో ఏమీ చెయ్యలేనట్టుగా, వాళ్ళ నిస్సహాయత కనపర్చి నన్ను ఈ మూడు బహుమతులతో నా బాధకు మంచి గంధం పూసి పంపారు.'' గొంతు పూడికుపోయినట్టయి చెప్పాల్సింది దుఃఖాన్ని దిగమింగుతూ భార్యా, కొడుకు లిద్దరికీ చెప్పి నా సింహాసనం పడకకుర్చీలో భారంగా కూర్చుండిపోయాను.

ఎంతసేపు అలా కూర్చున్నానో... మావాడి పిలుపుకు త్రుళ్ళిపడి కళ్ళు తెరిచాను. ''నాన్నగారూ! ఆవలెల్లుండి జరగబోయే ఇంటర్వ్యూకు ఈరోజే వెళ్తున్నాను.'' ఎయిర్‌బ్యాగ్ హడావడిగా సర్దుకుని చర.. చర బైటకు వెళ్ళిపోయాడు నా సుపుత్రుడు, నా అసమర్థత మీద అలిగినట్టుగా. వెనుకగా పిలుస్తున్న వాళ్ళ అమ్మ మాట కూడా లెక్కచేయలేదు. నాగొంతు మూగపోయి అలాగే చూస్తుండిపోయాను.

• • •

మధ్యాహ్నం పన్నెండు దాటుతుంది, భోజనానికి కూర్చోబోతుండగా ఊరి నుండి మావాడు లోపలికి వస్తూనే ''నాన్నగారూ! అమ్మా!! నాకు ఉద్యోగం వచ్చింది. ఇదిగోండి ఆర్డరు.'' నాచేతికిచ్చాడు ఆనందోత్సాహాలతో. నా చేతిలో వుంచిన ఆర్డరు చదువుతున్నాను. నేను ఏ ఇంటర్వ్యూకు రికమండేషన్‌కని పెద్ద పెద్ద హోదాలలోవున్న నా శిష్యుల దగ్గరకు వెళ్ళి ప్రాధేయపడి నిరాశతో వట్టిచేతుల్తో తిరిగి వచ్చానో అదే ఉద్యోగం... ఆశ్చర్యంగా కాగితం లోంచి మావాడిపై దృష్టి మరల్చాను.

మావాడు ఉత్సాహంగా చెప్పసాగాడు. ''రాంబాబు! రాంబాబు ఈ ఉద్యోగం ఇప్పించాడు.''

నేను మ్రాన్పడిపోయాను. వాడు చెప్పుకుపోతున్నాడు.

''అవును నాన్నగారూ! రాంబాబుకు ఎంత పలుకుబడి. వాడి అసలురూపం ఇప్పుడు తెలిసింది. ఇంటర్వ్యూకు మన ఇంటి నుంచి బయలుదేరిన నేను నేరుగా వాడిదగ్గరకెళ్ళాను. ఉద్యోగం ఇప్పించమని అడగడానికి కాదు, పైసలు లేకుండా ఏదయినా ట్రక్‌లో హైదరాబాద్ ఫ్రీగా పంపుతాడేమోనని. వాడు నా ప్రయాణానికి కారణం తెలుసుకుని, తనకావిషయం ఇంకా ముందు ఎందుకు చెప్పలేదని చివాట్లేసి, సమయం మించలేదులే అని ధైర్యం చెప్పి, తనవెంట పెట్టుకుని జిల్లా కేంద్రంలో ఒక వ్యక్తి దగ్గరకు తీసుకెళ్ళాడు.

అతను వెంటనే హైదరాబాదు ఫోన్‌చేసి ఒక ఉత్తరమిచ్చాడు. అది తీసుకుని రాష్ట్ర రాజధానిలో మరొకణ్ని కలిసాం. మేం తెచ్చిన ఉత్తరానికి తక్షణ చర్యగా మమ్మల్నిద్దర్నీ తీసుకు తనే స్వయంగా మరో వ్యక్తిదగ్గరకు తీసుకెళ్ళాడు.

ఆ వ్యక్తి మమ్మల్ని అధికార పార్టీలో వున్న మీశిష్యుడు వాసుకు ఎదురుగా నిలబెట్టాడు. ఎందరో కార్యకర్తలతో తలమునకలవుతున్న మీ శిష్యుడు మమ్మల్ని తీసుకువెళ్ళిన వ్యక్తిని చూచి, చలిజ్వరం వచ్చినవాడిలా వణికిపోయాడు. తడబడుతూనే మర్యాదలతో ముంచెత్తాడు.

విషయం తెలుసుకున్న వెంటనే మా ఎదురుగానే ఫోనులో మాట్లాడి మాదగ్గరకొచ్చి ''సంబంధిత ఆఫీసర్లతో మాట్లాడాను. ఇంటర్వ్యూ అయ్యాక తనని కలవమని'' నా భుజం తట్టి చెప్పాడు. నేను ఫలానా అని చెప్పలేదులెండి. మరుసటిరోజు నేను ఒక్కడినే ఆయన్ను కలిసాను. ''ఇదిగో అబ్బాయి నీ ఉద్యోగ ఉత్తరవు. బాగా పనిచేసుకో.'' అని కరచాలనం చేసి మరీ పంపాడు. నమస్కారం చెప్పి, ఈ కవరుతో రాత్రి బండెక్కి వచ్చాను.

నిముషం విశ్శబ్దం అందరి మధ్యా!

''నాన్నగారూ! రాంబాబు రికమండేషన్ చేయించిన వ్యక్తులంతా ఎవరో తెలుసా? ఈ రాష్ట్రాన్ని పరోక్షంగా ఏలుతున్న మండల, జిల్లా, రాష్ట్ర, గూండా రాజులట. గత రెండు నెలలుగా మన రాష్ట్రాన్ని గడ.. గడ లాడించింది వాళ్ళేనట. వాళ్ళంటే ఉద్యోగ వ్యాపార స్థులకే కాదు, రాజకీయ నాయకులకీ హడలట.'' ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు.

''నేను రాంబాబు దగ్గరకెళ్తున్నాను. థాంక్సు చెప్పిరావాలి. వాడు నాకన్నా ముందు వచ్చేశాడు ఏదో అర్జంటు పనుందని.'' బైటకెళ్ళాడు హుషారుగా నా సుపుత్రుడు.

నాకు నోటమాట రాలేదు. భోజనానికి కూర్చోబోయిన నా ఆకలి హరించింది. నా ఆలోచనంతా రాంబాబు కనిపిస్తే నేఎలా ప్రవర్తించాలి!? వాడి వాడుగు శబ్దకాలుష్యమని చెవులు మూసుకోవాలా? నా కొడుక్కి ఉద్యోగం ఇప్పించినందుకు చేతులెత్తి నమస్కరించాలా? ఎన్నో ఇజాలకి మద్దతు పలికిన నేను ఈ వర్తమాన భూతమైన రౌడీ ఇజానికి ఎలా నిరసన చెప్పాలి.




నా కొడుకులాంటి యువతరాన్ని ఆకర్షించే ఈ దౌర్భాగ్యపు ఇజాన్ని సమాధి చెయ్యడానికి ఏం చెయ్యాలి? ఈ వర్ధమాన భూతాన్ని అంతం చేయడానికి వైద్యులు సిద్ధంకావాలి. ఎన్నో ప్రశ్నలు నన్ను వేధిస్తుండగా నా సింహాసనాన్ని ఆశ్రయించాను. ఏదయినా తరుణోపాయం అదయినా చెపుతుందేమోనని!

★